
# పార్టీ కి పని చేయని వారికి పదవులా?



బోథ్ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వ్యవహారం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడి, ప్రతి ఎన్నికలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల వరకు పార్టీ జెండా ఎగరేయడానికి పోరాడిన నిజమైన సైనికులను పక్కన బెట్టి, గతంలో పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారిని పదవులతో సత్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు గుప్పుమంటు న్నాయి. దీంతో నిజమైన కార్యకర్తల గుండెలు మండుతు ఆగ్రహా నికి దారితీస్తున్నాయేమో! పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులకు పనిచేసిన వారే నేడు పదవుల రేసులో ముందుంటే, ఇది కేవలం అన్యాయం కాదు పార్టీ పునాదులపై దాడి.




జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

# ఆదిలాబాద్

## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

బుధవారం 6 మే 2026 పేజీలు : 8


# శాస్త్రీయ వ్యవసాయ సాగుతో అధిక దిగుబడి సాధ్యం



వ్యవసాయ సాగులోశాస్త్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రైతు వారంలో నిర్వహించిన ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నా యపంటల సాగు అంశాలపై జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

## మే 6వ తేదీ రోజున 10 గంటలకు దహెగాం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల

# ఐక్య వేదిక సమావేశం

ముఖ్యతిథిగా పాల్గొన నున్న తెలంగాణ ఉద్యమ కారుల రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనా రాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్

సిర్పూర్(టి) నియోజకవర్గంలోని అన్ని మండల ల ఉద్యమ కారులు ఆహ్వానితులే:

దహేగం మండల ఉద్యమకారులు పుల్లం నారాయణ:



# నేడు ఇంటర్నేషనల్ "నో డైట్ డే"

## శరీరాకృతి జీవిత లక్ష్యం కాదు




**మంచిర్యాల, 5,మే (ప్రజా జ్యోతి):**ప్రతి సంవత్సరం మే 6న ప్రపంచ వ్యాప్తంగా "ఇంటర్నేషనల్ నో డైట్ డే" నిర్వహించబడుతుంది. ఈ దినోత్సవాన్ని మొదటగా 1992లో ఇంగ్లాండ్‌లో జరుపుకున్నారు. పేరు విన్న వెంటనే చాలామందికి "ఈ రోజు ఏది తిన్నా పర్లేదా?" అనే సందేహం కలగొచ్చు. కానీ ఈ దినోత్సవం యొక్క అసలు ఉద్దేశ్యం అది కాదు.ఈ రోజు కేవలం డైట్‌కి వ్యతిరేకంగా నిలబడటానికి కాదు; శరీరాకృతిపై సమాజం పెడుతున్న అనవసర ఒత్తిడిని ప్రశ్నించడానికి. ఆరోగ్యం అంటే కేవలం బరువు తగ్గడమే కాదని, దాన్ని విస్తృత దృక్పథంతో చూడాలని గుర్తుచేసే రోజు ఇది. ఈ ఆధునిక సమాజంలో "సన్నగా ఉంటేనే అందం", "జీరో సైజ్ అంటేనే ఫిట్‌నెస్" అనే అపోహలు బలంగా స్థిరపడ్డాయి. సోషల్ మీడియా, సినిమాలు, ప్రకటనలు, ఫిట్‌నెస్ పరిశ్రమ లన్ని కలిసి ఒక నిర్దిష్ట శరీరాకృతినే ఆదర్శంగా చూపిస్తున్నాయి. దీని ప్రభావంతో చాలామంది యువత, ముఖ్యంగా యువతులు, తమ సహజ శరీర నిర్మాణాన్ని అంగీకరించ కుండా కఠినమైన డైట్లను అనుసరిస్తూ శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు."డైట్" అనే పదం అసలు అర్థం సమతుల ఆహారం. అయితే కాలక్రమేణా అది "తక్కువ తినడం", "కొన్ని ఆహారాలను పూర్తిగా మానేయడం", "త్వరగా బరువు తగ్గడం" వంటి భావాలతో ముడిపడి పోయింది. వేగంగా బరువు తగ్గాలనే ఆశతో చాలామంది క్రాష్ డైట్లు, లిక్విడ్ డైట్లు, ఫ్యాడ్ డైట్లు వంటి అనా రోగ్యకర మార్గాలను ఎంచుకుంటున్నారు. ఇవి తాత్కాలిక ఫలితాలు ఇవ్వొచ్చు కానీ దీర్ఘకాలంలో శరీరానికి అవసరమైన పోషకాలు తగ్గిపోవడం, బలహీనత, హార్మోన్ అసమతుల్యత, మానసిక ఒత్తిడి వంటి సమస్యలకు దారితీస్తాయి.ఆరోగ్యం అనేది కేవలం బరువు తగ్గడంలో లేదు. సరైన నిద్ర, మానసిక ప్రశాంతత, శారీరక చురుకు దనం, సమతుల ఆహారం, ఆత్మవిశ్వాసం---ఇవన్నీ కలిసే నిజమైన ఆరోగ్యం. ఒక వ్యక్తి సన్నగా ఉన్నా అనారోగ్యంగా ఉండవచ్చు. మరోవైపు కొద్దిగా లావుగా కనిపించే వ్యక్తి మంచి ఆరోగ్యంతో ఉండవచ్చు. అందువల్ల శరీరాకృతిని చూసి ఆరోగ్యాన్ని అంచనా వేయడం తప్పుడు దృక్పథం.ఈ దినోత్సవం మరో ముఖ్య సందేశం "బాడీ పాజిటివిటీ". ప్రతి శరీరానికి తన ప్రత్యేకత ఉంటుంది. రంగు, ఆకారం, బరువు, ఎత్తు---ఇవేవీ మన వ్యక్తిత్వాన్ని నిర్ణయించవు. కానీ సమాజం చాలాసార్లు శరీరాన్ని చూసి తీర్పు ఇస్తుంది. "బాగా లావయ్యావు", "చాలా సన్నగా ఉన్నావు", "కొంచెం తగ్గాలి" వంటి వ్యాఖ్యలు సరదాగా అనిపించినా, అవి వ్యక్తుల మనసుపై లోతైన గాయాలు మిగల్చవచ్చు.ప్రత్యేకించి యువతలో సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉంది. ఫిల్టర్లు, ఎడిటెడ్ ఫోటోలు, అవాస్తవ అందపు ప్రమాణాలు వారిలో అసంతృప్తిని పెంచుతు న్నాయి. ఇతరులతో తమను పోల్చుకుంటూ ఒత్తిడికి లోనవుతున్నారు. దీని వల్ల ఈటింగ్ డిసార్డర్స్, డిప్రెషన్, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వంటి సమస్యలు పెరుగు తున్నాయి.అందుకే ఈ దినోత్సవం ఒక హెచ్చరికలా పనిచేస్తోంది. మన శరీరాన్ని శత్రువుగా కాకుండా మిత్రుడిగా చూడాలని చెబుతోంది. బరువు తగ్గడమే లక్ష్యంగా కాకుండా ఆరోగ్యంగా ఉండడమే లక్ష్యంగా జీవనశైలిని మార్చుకోవాలని సూచిస్తోంది.మన సమాజంలో కూడా శరీరాకృతిపై ఉన్న వివక్ష తగ్గాలి. కుటుంబాలు, పాఠశాలలు, కార్యాలయాల్లో శరీర వైవిధ్యంపై అవగాహన పెంచాలి. ఆరోగ్యాన్ని కేవలం బరువుతో కాకుండా సమగ్ర శ్రేయస్సుగా అర్థం చేసుకోవాలి.మన శరీరాన్ని ప్రేమించాలి, గౌరవించాలి, ఆరోగ్యంగా ఉంచాలి; కానీ సమాజం విధించిన అందపు ప్రమాణాల బానిసలుగా మారకూడదు. ప్రతి శరీరాన్నీ గౌరవించే సమాజాన్ని నిర్మించడం. అదే ఈ దినోత్సవానికి నిజమైన నివాళి అని సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు.

**అడిషనల్ కలెక్టర్ రాములు**



**జన్నారం,మే5(ప్రజాజ్యోతి)** కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) రాములు అధికారులకు సూచించారు. మంగళవారం రోజున మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని,మార్కెట్ యార్డ్ లో ఉన్న గోదాం లను పరిశీలించారు.తేమ శాతం, రికార్డులను పరిశీలించి, రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, మిల్లులకు ధాన్యం తరలింపు సజావుగా సాగాలని, దళారుల ప్రమేయం ఉండకూడదని ఆదేశించారు.అనంతరం మండలంలోని మొర్రిగూడ గ్రామంలో ఉన్న శ్రీ రాఘవేంద్ర రైస్ మిల్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బక్కయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, ఐకెపి ఎపిఎం లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన

**తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం**



**మంచిర్యాల, 5 మే (ప్రజా జ్యోతి):**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశంను మంగళవారం నిర్వహించారు. ఇందులో ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని జరిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామక పాండురంగ శర్మ మాట్లాడుతూ, డిగ్రీ అనంతరం ఉన్నత విద్యను కొనసాగించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థినులు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించా లని ప్రిన్సిపాల్ సూచించారు. ఇటీవల విడుదలైన సీయూఈటీ (సీయూఈటీ) ఫలితాలపై కూడా ఆయన మార్గదర్శకత్వం అందించారు. అనంతరం కళాశాల విద్యార్థి నులు సాధించిన ఉత్తమ విజయాలను తల్లిదండ్రులతో పంచుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కళాశాల చేస్తున్న కృషిని తల్లిదండ్రులు ప్రశంసించారు. రాబోయే విద్యా సంవత్సరానికి అడ్మిషన్ ప్రక్రియలో పూర్తి సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా ఉన్నత విద్య ప్రాముఖ్యతను, విద్యార్థుల అభివృద్ధి అవసరాన్ని స్పష్టంగా తెలియజేసింది. ఈ కార్యక్రమాన్ని బి. ప్రియాంక (కామర్స్ అధ్యాపకురాలు) నిర్వహించగా, అధ్యాపకులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ధాన్యం అమ్మకాల విషయం లో మంచిర్యాల జిల్లాలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు

### రాష్ట్ర బీజెపి అధ్యక్షునికి పరిస్థితిని వివరించిన మంచిర్యాల జిల్లా సీనియర్ బీజెపి నాయకులు

**మంచిర్యాల, 5,మే ( ప్రజా జ్యోతి ):**మంచిర్యాల జిల్లాలో రైతులు ధాన్యం అమ్మకాల విషయం లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు రాష్ట్ర నాయకత్వానికి వివరించారు. బీజేపీ సీనియర్ నాయకులు కాశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావును ఆయన నివాసంలో కలిసి జిల్లాలోని పరిస్థితిని వినతిపూర్వకంగా వివరించారు.ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రభుత్వ విధానాల కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై సమగ్రంగా చర్చించారు. అలాగే జిల్లాలోని ఇతర ప్రజా సమస్యలు, పార్టీ సంస్థాగత అంశాలపై కూడా కూలంక షంగా అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 10 న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు మంచిర్యాల జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు.



సభకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని త్వరలో వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. 10వ తేదీ వరకు మోదీ సభ విజయవంతం కోసం నిరంతర ప్రచారం నిర్వహిస్తూ ప్రతి కార్యకర్త ప్రజలను స్వచ్ఛందంగా సభకు తరలించేలా కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాశెట్టి నాగేశ్వరరావు, తుల మధుసూదన్ రావు, బొలిశెట్టి తిరుపతి, దాస్య నాయక్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీ.సీ.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ



**జన్నారం,మే5(ప్రజాజ్యోతి)** పూర్ణచంద్రరావు(పీ.సీ.ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిర్వహించే మజ్జిగ పంపిణీ ఈ వారం కూడ కొనసాగింది.జన్నారం మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారసంతకు వచ్చే వివిధ గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముదుగు ప్రవీణ్ తెలిపారు. వేసవికాలం పూర్తియ్యేంతవరకు ప్రతి మంగళవారం పీ.సీ.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఉత్తూరి శ్రీనివాస్,జన్నారం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, ఫౌండేషన్ సభ్యులు నిముషకవి రాజేష్,చకినాల భూమేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు

## ఆయిల్‌ఫాం సాగు చేపట్టండి

**రైతులకు కలెక్టర్ హరిత పిలుపు**

**సబ్సిడీ ఇస్తామని వెల్లడి**



**ఆసిఫాబాద్, మే 5 (ప్రజా జ్యోతి** జిల్లాలో ఆయిల్‌ఫాం సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, సాగునీటి వసతి ఉన్న రైతులు ముందుకు రావాలని కలెక్టర్ హరిత పిలుపునిచ్చారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వారం ఆసిఫాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. కలెక్టర్ హరితతో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. డేవిడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కాండే అనిల్, ఆసిఫాబాద్, జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇరుకుల్ల మంగ, కుద్మేత విశ్వనాథ్, ఉద్యానవన శాఖ అధికారి నదీమ్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటి పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌ఫాంకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, మొదటి నాలుగేళ్లు అంతర్ పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పంటకు చీడపీడలు, పశువులు, కోతుల బెడద లేదని, అధిక లాభాలు వస్తాయని వివరించారు. పత్తి, వరికి బదులు కూరగాయలు, ఆయిల్‌ఫాం వంటి ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచించారు. ప్రస్తుతం వంటనూనెలు దిగుమతి చేసుకుంటున్నామని, స్థానికంగా ఆయిల్‌ఫాం సాగు పెరిగితే చౌకగా లభిస్తాయని తెలిపారు. కుటుంబానికి సరిపడా పంటలు పండించుకుంటే అనారోగ్య సమస్యలు రావని చెప్పారు.అనంతరం ప్రత్యామ్నాయ పంటలు వేసిన ఆదర్శ రైతులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన పంటను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్



**మంచిర్యాల, 5, మే (ప్రజా జ్యోతి):**మంచిర్యాల నియోజకవర్గం లో రైతులు పండించిన పంటను ఎలాంటి తరుగు, షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు.యాసంగి వడ్లు, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రాల్లో రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ధర్నా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులపై అనవసర భారం మోపుతున్నారని ఆరోపించారు. వరి ధాన్యానికి బస్తాకు మూడు కిలోల తరుగు విధిస్తున్నారని, ఇది రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే బస్తాలు కాంటా చేసిన తర్వాత లారీ ద్వారా పంట తరలింపుకు బస్తాకు రూ.2 చొప్పున వసూలు చేయడం గతంలో ఎప్పుడూ లేనిది అని, ఇది అవినీతికి నిదర్శన మని విమర్శించారు.మొక్క జొన్న పంట విషయంలోనూ ఒక ఎకరానికి కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటు న్నారని, ఎలాంటి షరతులు లేకుండా 40 క్వింటాళ్లు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్క గన్ని బ్యాగుకు 40 కిలోలు పూర్తి బరువుతో తీసుకోవాలని కోరారు.వరి ధాన్యాన్ని ఏ, బీ గ్రేడ్‌లుగా విభజించి కొనుగోలు చేయడం వల్ల క్వింటాలుకు సుమారు రూ.20 నష్టం వస్తోందని, మొత్తం ధాన్యాన్ని బీ గ్రేడ్‌గా కొనుగోలు చేయడం రైతులకు అన్యాయమని అన్నారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని ఏ గ్రేడ్ గానే కొనాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాలుకు 500 బోనస్ వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు రైతుల పంట కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తు న్నాయని విమర్శించారు. కేంద్రంలో ఎంపీలను బీజేపీ కొనుగోలు చేస్తోందని, రాష్ట్రం లో ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ ప్రభావితం చేస్తోందని, కానీ రైతుల పంటను మాత్రం కొనుగోలు చేయడం లేదని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని అన్నారు. వెంటనే ఎలాంటి షరతులు, తరుగు లేకుండా పంట కొనుగోలు చేయకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# ఈ ఆర్థిక సంవత్సర లక్ష్య సాధనకు కలిసికట్టుగా కృషి చేయాలి

### రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై ప్రత్యేక దృష్టి సారించాలి

### శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్



**మంచిర్యాల, 5,మే (ప్రజా జ్యోతి):**ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కోరారు. అదే విధంగా రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 భూగర్భ గనిలో రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా క్షేత్రస్థాయి సమీక్షా సమావేశంను మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశా నికి జీఎం మునిగంటి శ్రీనివాస్ హాజరయ్యారు. గత ఏడాది ఉత్పత్తి వివరాలను డీజీఎం (ఐఈడీ) రాజన్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉద్యోగులు, యంత్రాల వినియోగం, పరికరాల పనితీరు తదితర అంశాల్లో ఉన్న లోటుపాట్లను కూడా సమీక్షించారు. గత అనుభవాలను ఆధారంగా చేసుకొని ఈసారి అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా ఈ సమావేశంలో చర్చించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల వినియోగం వంటి అన్ని అంశాల్లో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని జీఎం సూచించారు. గత ఏడాది స్వల్ప తేడాతో ఉత్పత్తి లక్ష్యం సాధించలేక పోయిన ఆర్కే-7 గని, ఈసారి 100 శాతం లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని జీఎం పిలుపునిచ్చారు.డ్రిల్లింగ్ సంఖ్య పెంచడం, ఎస్డీఎల్ యంత్రాల సమర్థ వినియోగం ద్వారా ఉత్పత్తి శాతం పెంచాలని ఆయన సూచించారు. బొగ్గు ఉత్పత్తి సంస్థగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడం ద్వారానే సింగరేణి సంస్థ మనుగడ సాధ్యమన్నారు.ఓపెన్ కాస్ట్ గనులకు దీటుగా భూగర్భ గనులను నడిపే అవసరం ఉందని, అందుబాటులో ఉన్న మానవ వనరులను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ కె. రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, పిట్ ఇంజనీర్ ప్రవీణ్, సేఫ్టీ ఆఫీసర్ సంతోష్, సంక్షేమ అధికారి సంతన్, పిట్ సెక్రటరీ సారయ్య, అసిస్టెంట్ మేనేజర్లు, అండర్ మేనేజర్లు, మైనింగ్ సిబ్బంది, సూపర్వైజర్లు, మైన్స్ కమిటీ మరియు సేఫ్టీ కమిటీ సభ్యులతో పాటు గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా కూడా పాల్గొన్నారు.

## అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

- అదనపు కలెక్టర్ వదాల రాములు



**దండేపల్లి, మే 5(ప్రజాజ్యోతి):** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల అదనపు కలెక్టర్ వదాల రాములు హెచ్చరించారు. మంగళవారం దండేపల్లిలోని పీపీసీ-02 కేంద్రాన్ని డీసీఎస్ఓ బ్రహ్మారావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ప్రతి బస్తాకు 41 కిలోల తూకం వేయాలని, సీరియల్ సంఖ్య ప్రకారమే కొనుగోళ్లు జరపాలని ఆదేశించారు. కొన్ని కేంద్రాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారంలో నిజం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. త్వరితగతిన లారీలను పంపి రవాణా ఇబ్బందులు తొలగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రోహిత్, ఏపీఎం లక్ష్మి, గిర్దావర్ భూమన్న పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను సందర్శించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పరిశీలన



**మంచిర్యాల, 5, మే (ప్రజా జ్యోతి):** బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జోన్ పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాపన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, సిబ్బంది ఆరోగ్యం, భద్రతపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పండుగ సమయంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ సీఐ బన్సీలాల్, కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవ హక్కులపై షార్ట్ ఫిల్మ్ పోటీల కు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు

జిల్లా కలెక్టర్ హరిత



**కొమురం భీమ్ జిల్లా ప్రతినిధి ( వాంకిడి) మే 05 ప్రజా జ్యోతి** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మనవ హక్కుల పై షార్ట్ ఫిల్మ్ పోటీలలో పాల్గొనడానికి ఆసక్తి గల వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను జూన్ 30 వరకు దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ హరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ మనవ హక్కుల కమిషన్ ఆద్వర్యంలో 2026 సంవత్సరానికి షార్ట్ ఫిల్మ్ పోటీలకు దేశ పౌరుల నుండి ఆన్ లైన్ ద్వారా ఎంట్రీలను ఆహ్వానించిందని. జిల్లాలోని ఆసక్తి కలిగిన వారు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ పోటీలకు వయస్సు తో సంబంధం లేదన్నారు. ఆసక్తి కలిగిన వారు ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోటీలలో వేజేతలకు ప్రధమ బహుమతి 2 లక్షలు, ద్వితీయ బహుమతి లక్ష యాభై వేలు, తృతీయ బహుమతి లక్ష రూపాయలు, వుందని తెలిపారు. ఆసక్తి కలవారు జూన్ 30 లోపు తమ ఎంట్రిలను ద్వారాకి పంపించాలని కలెక్టర్ తెలిపారు.

## వేసవికాలంలో ఐదవరోజు దివాకర్ అన్న పెరుగన్నం పంపిణీ




**మంచిర్యాల, 5, మే (ప్రజా జ్యోతి):** వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు చల్లదనం, ఆరోగ్య పరిరక్షణ కల్పించాలనే ఉద్దేశంతో మంచిర్యాలలో 5 వ రోజు "దివాకర్ అన్న పెరుగన్నం" కార్యక్రమాన్ని నిర్వహించారు. నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ మంగళవారం ఈ కార్యక్రమంలో పాల్గొని పెరుగన్నం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పెరుగన్నం పంపిణీ చేస్తూ వేసవిలో శరీరానికి అవసరమైన ద్రవాలు, పోషకాహారం అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు గాదె సత్యం , 4వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్ లు పాల్గొన్నారు. అలాగే నాయకులు నార్ల వంశీ, రామగిరి శ్రీకాంత్, పెంట శ్రీనివాస్, వీర్ల తిరుమల్ రావు ,5వ డివిజన్ నాయకులు పైతరి రమేష్, బింగి సదానందం, సల్లం ప్రజ్వల్, వేముల స్వామి, పెరుక సత్తయ్య, కవ్వంపెల్లి అఖిల్, భూక్య భద్ర, నున్సవత్ జెస్, ఉదురుకోట నరేష్, అరుణ్ తదితరులు,అదేవిధంగా 13వ డివిజన్ నాయకులు జమీల్ బాబా, వనరాశి, శ్రీకాంత్, సల్మాన్, చోటు, అను తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## మంచిర్యాల నియోజకవర్గంలో పలుచోట్ల అంబలి పంపిణీ కార్యక్రమం



**మంచిర్యాల, 5,మే (ప్రజా జ్యోతి):** కే. శే. కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మంగళవారం మంచిర్యాల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించా రు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో బస్టాండ్, మార్కెట్, ఐబీ చౌరస్తా, హమాలీవాడ, సిసిసి కార్నర్, శ్రీరాంపూర్ కాలనీ వంటి ప్రాంతాల్లో అంబలి పంపిణీ చేశారు. అదేవిధంగా లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఉత్కూర్ చౌరస్తా వద్ద కూడా ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ప్రజలకు అంబలి అందజేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేలా చేపట్టిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల నుండి మంచి స్పందన పొందింది.

## రాష్ట్ర సైట్ ప్రొఫెసర్ డా. కె. రవికాంత రావుకు ఘనంగా సన్మానం

సన్మానించిన "వాల్టా" అథారిటీ సభ్యుడు గుండేటి యోగేశ్వర్



**మంచిర్యాల, 5,మే (ప్రజా జ్యోతి):** తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర విద్యా సాంకేతిక సంస్థ (ఎస్ఐఈటి) ప్రొఫెసర్ డా. కె. రవికాంత రావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లోని వయోజన విద్యా కార్యాలయానికి వచ్చిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ రక్షణ "వాల్టా" అథారిటీ సభ్యుడు, జిల్లా విద్యాశాఖ రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా. రవికాంత రావుకు పుష్పమాల, శాలువా కప్పి సన్మానపత్రం అందజేశారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అను బంధాన్ని గుర్తు చేసుకుంటూ, వారి మార్గదర్శకత్వం, ప్రోత్సాహం తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనిదని యోగేశ్వర్ తెలిపారు. మంచిర్యాల జిల్లాలో తొలి విద్యాశాఖ అధికారిగా పనిచేసిన డా. రవికాంత రావు, జిల్లా విద్యాభివృద్ధికి అందించిన విశిష్ట సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా డా. రవికాంత రావు మాట్లాడుతూ, పర్యావరణ రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న గుండేటి యోగేశ్వర్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు. "ప్రకృతి మిత్ర" సంస్థ ద్వారా రాష్ట్ర స్థాయిలో ఆయన అందిస్తున్న సేవలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు.

## పార్కింగ్ సమస్యకు స్మార్ట్ సొల్యూషన్ ఆసిఫాబాద్ బృందానికి పేటెంట్

**పార్కింగ్ కష్టాలకు చరమగీతం**

**విద్యార్థి మమత ఆవిష్కరణకు పేటెంట్**

**పార్కింగ్‌కు టెక్నో చెక్**

**కలెక్టర్ అభినందించిన ఆవిష్కర్తలు**



**ఆసిఫాబాద్ మే 5ప్రజా జ్యోతి** రద్దీ ప్రదేశాల్లో పార్కింగ్ సమస్యలకు పరిష్కారం చూపే" డిజైన్‌కు కేంద్ర ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం నుంచి అధికారిక నమోదు లభించింది. 05 జనవరి 2026న 486267-001 రిజిస్ట్రేషన్ నంబర్‌తో నమోదైన ఈ డిజైన్‌ను ఉపాధ్యాయుడు మౌల్కారి కేశవ్, విద్యార్థి అల్సా మమత, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ రూపొందించారు. కలెక్టర్ కె. హరిత ఆవిష్కర్తలను అభినందించారు. విద్యార్థి మమత మాట్లాడుతూ ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు ఈ డిజైన్ సాంకేతిక పరిష్కారం చూపుతుందని తెలిపింది. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం విశేషమని, ఇది యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ పేర్కొన్నారు. నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపితే సమాచారం ఇచ్చే డివైజ్ తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో లలిత పాల్గొన్నారు

## గ్యాస్ ధరల పెంపుతో ప్రజలపై భారం

**- కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం**



**జైపూర్, మే 5 (ప్రజా జ్యోతి)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జైపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంట గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై భారీ భారం మోపుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ఇటీవల కమర్షియల్ గ్యాస్ ధరలను ఒక్కసారిగా రూ. 993 వరకు పెంచడం చిన్న వ్యాపారులకు తీవ్ర దెబ్బగా మారిందన్నారు. దీంతో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు కోలుకోలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం పై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. జీఎస్టీ పేరుతో రాష్ట్రం నుంచి రూ. 4.32 లక్షల కోట్లు వసూలు చేసి, తిరిగి కేవలం రూ. 1.84 లక్షల కోట్లు మాత్రమే వివిధ గ్రాంట్ల రూపంలో విడుదల చేయడం అన్యాయమని పేర్కొన్నారు. దేశంలో మత, కుల విభేదాలను రెచ్చగొట్టి ప్రజల ఐక్యతను దెబ్బతీయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్ల విశ్వంబర్ రెడ్డి, సర్పంచులు కూన భాస్కర్, గుడెల్లి శ్రీనివాస రెడ్డి, వెంకన్న, జిల్లా కార్యదర్శి గోనె నర్సయ్య, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, పండుగ రాజన్న, గంజి రాజన్న, అంబల్ల రవి, ఆగిడి లింగయ్య, ఇస్కమల్ల రవి, మార్త మారుతి, గట్టయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాం కు పటిష్ట బద్రత

**జిల్లా కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్ మే:05 ప్రజా జ్యోతి** జిల్లా కేంద్రంలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను బద్రపరిచిన గోదాం కు పటిష్ట బద్రత కల్పించడము జరుగుతుందని కలెక్టర్ హరిత అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రంలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను బద్రపరిచిన గోదాం ను నెలవారి తనిఖిలో భాగంగా సందర్శించి సి సి కెమెరాల పని తీరు, గేటుకు వేసిన సిలును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాం వద్ద పటిష్ట బద్రత కల్పించడం జరుగుతుందని 24 గంటల పాటు సి సి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎన్ని విభాగం సుపరిండేంట్ జమిల్, నాయబ్ తహసిల్దార్ శ్యాంలాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కే-5 గని సందర్శించిన ఏఐటీయూసీ నాయకులు

**కార్మిక సమస్యలపై చర్చ**



**మంచిర్యాల, 5,మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే -5 గనిని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగాయూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శు లు కే. వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కే. బాజీ సైదా లు గనిని సందర్శించి కార్మికుల ను కలిసి వారి సమస్యలపైచర్చించారు. కార్మికులు ముఖ్యంగా డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్ల కొరత తీవ్రంగా ఉందని తెలియ జేశారు. అదేవిధంగా రూఫ్ బోల్టర్ యంత్రం పని ప్రదేశానికి దూరంగా ఉండటం తో ఇబ్బందులు ఎదురవు తున్నాయని, దాన్ని దగ్గరలో ఏర్పాటు చేయాలని కోరారు. ఇక తుంటలు, గుటకలు కొరతతో పాటు హ్యాండ్ గ్లౌజ్‌లు, రూఫ్ బోల్టర్ రాడ్లు, ప్యాకింగ్ చెక్కల కొరత ఉందని తెలిపారు. ఎస్‌డీఎల్ యంత్రాలకు లీడ్ ఎక్కువగా ఉండటం వల్ల పనిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, 27వ లెవెల్‌లో తాగునీటి సమస్య కూడా ఉందని కార్మికులు వివరించారు. ఈ సమస్యలను గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. దీనిపై మేనేజర్ సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి జి. నర్సింగరావు, సంఘ రాజయ్య, భోగం మధునయ్య, నాగుల రాజయ్య, శంకర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన అడవి శాఖ జిల్లా అధికారి



**కొమరం భీమ్ జిల్లా ప్రతినిధి ( వాంకిడి ) మే 05 ప్రజా జ్యోతి** కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నూతన అటవీ శాఖ అధికారి( డి ఎఫ్ ఓ ) బాలమణి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు అటవీ సంరక్షణ, వృక్షారోపణ కార్యక్రమాల అమలు మరియు ఇతర పరిపాలనా విషయాలపై కలెక్టర్ కి వివరించారు

## రద్దీ ప్రదేశాల్లో పార్కింగ్ సమస్యలకు వినూత్న పరిష్కారం

**పార్కింగ్ మేనేజ్మెంట్ ఇన్ క్రౌడెడ్ ప్లేసెస్ అనే డిజైన్ కు అధికారికంగా నమోదు చేసిన భారత ప్రభుత్వం**

**దీనిని ఆవిష్కరించి రూపొందించడానికి విద్యార్థిని అల్స మమత కు సహకరించిన:**

**ఉపాధ్యాయులు మాల్కర్ కేశవ్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ ను విద్యాశాఖ అధికారి లలిత తో కలిసి అభినందించిన జిల్లా కలెక్టర్ కె. హరిత:**



**మే 5, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో రద్దీ ప్రదేశాల్లో ప్రదేశాల్లో పార్కింగ్ సమస్యలకు వినూత్న పరిష్కారం. పార్కింగ్ మేనేజ్మెంట్ ఇన్ క్రౌడేడ్ ప్లేసెస్ అనే డిజైన్ . ఈ డిజైన్ కు సంబంధిం చిన రిజిస్ట్రేషన్ నంబర్:486267బి001 దీనిని ప్రభుత్వం పేటెంట్ కార్యాలయం నుండి అధికారికంగా నమోదు దించడంతో దీనిని ఆవి ష్కరించి రూపొందించడా నికి విద్యార్థిని అల్సా మమత కు సహకరించిన ఉపాధ్యాయులు మౌల్కర్ కేశవ్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ ను జిల్లా విద్యాశాఖ అధికారి లలిత తో కలిసి అభినందించిన జిల్లా కలెక్టర్ కె. హరిత. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిత కోరిక మేరకు విద్యార్థిని అల్స మమత ప్రాజెక్టు గురించి వివరించి విశ్లేషించి క్లుప్తకరించి అవగాహన చేయగా ఈ డిజైన్ నమోదు ద్వారా నగరాలలో పెరుగుతున్న ట్రాఫిక్ అదేవిధంగా పార్కింగ్ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అందించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ నిర్వహణను సులభతరం చేయడంలో ఈ డిజైన్ ఉపయోగపడనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ.. జిల్లాలోని విద్యార్థులకు, యువతకు ఇది ఒక ప్రేరణగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు. ఇలాంటి ఆవిష్కరణలు చేసి రూపొందించడం గ్రామీణ ప్రాంతాల నుంచే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం విశేష మని అన్నారు. అదేవిధంగా నో పార్కింగ్ ప్రదేశాలలో పార్కింగ్ చేస్తే అధికారులకు సమాచారం ఇచ్చే డిజైన్ రూపొందించాలని సూచించారు.

## కన్నుల పండుగగా రామయజ్ఞం



**జన్నారం,మే5(ప్రజాజ్యోతి)** జన్నారం మండలం కలమడుగు గ్రామంలో శ్రీ శ్రీ నర నారాయణ స్వామి ఆలయంలో కన్నుల పండుగ రామ యజ్ఞం నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ పూజారి రాజా నరేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి నానా రీతుల అభిషేకం,అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల రామ నామ స్మరణ మధ్య రామయజ్ఞం నిర్వహించారు.రామయజ్ఞానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ కుమార్, గ్రామ పెద్దలు బొంతల మల్లేష్ గౌరయ్య విష్ణు, గ్రామ పెద్దలు 103 మంది ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు.

## బాసర ఐఐఐటీలో విద్యార్థులకు నైపుణ్యాత్మక విద్యా బోధన అందించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 5 ,( ప్రజాజ్యోతి ).**బాసర ఐఐఐటీలో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఐఐఐటి క్యాంపస్‌ను సందర్శించి యూనివర్సిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి సంబంధించిన విభాగాలు, మొత్తం విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న విద్యా విధానం, అధ్యాపకుల వివరాలు, వసతి సౌకర్యాలు, సదుపాయాలు, విద్యార్థులు సాధించిన విజయాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, క్యాంపస్ విద్యార్థులను ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా బోధనలో ఆధునిక, సులభతర పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధన సాగించాలని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులందరికీ ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యను అందించాలని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. యూనివర్సిటీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం యూనివర్సిటీ అధికారులు జిల్లా కలెక్టర్ ను, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌లను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, డిఆర్డిఒ విజయలక్ష్మి, తహసీల్దార్ పవన్ చంద్ర, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ వ్యవసాయ సాగుతో అధిక దిగుబడి సాధ్యం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

### రైతు వారంలో భాగంగా చెన్నూరులో సమీక్ష సమావేశం

**మంచిర్యాల, 5, మే (ప్రజా జ్యోతి):**వ్యవసాయ సాగులోశాస్త్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రైతు వారంలో నిర్వహించిన ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నా య పంటల సాగు అంశాలపై జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సమావేశానికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత, మండల తహసిల్దార్ మల్లికార్జున్, చెన్నూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మతో పాటు మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు హాజరయ్యారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ, ఒకే రకమైన పంట సాగు చేయ కుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి వ్యాపార, వాణిజ్య పంటలపై రైతులు దృష్టి సారించా లన్నారు. నిరంతరంగా ఒకే పంట సాగు చేయడం వల్ల భూసారం తగ్గుతుందని హెచ్చరించారు.ప్రస్తుత మార్కెట్లో రా రైస్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో సన్న రకం ధాన్యం సాగుపై రైతులు దృష్టి పెట్టాలని తెలిపారు.ప్రభుత్వం సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు.అలాగే ఆయిల్ పామ్ సాగు ద్వారా మంచి ఆర్థిక లాభాలు పొందవచ్చని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన యూరియా, డీఏపీని




అవస రానికి మాత్రమే వినియోగించాలని సూచించారు. రైతు వేదికల ద్వారా పంటల సాగు విధానాలు, పంట మార్పిడి, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.అవసరమైతే రైతులు వ్యవసాయ, ఉద్యాన, విస్తరణ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేశారు.అంతకు ముందు చెన్నూరులో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు గదులు, భోజన శాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.తదుపరి తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, వసతి గృహాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. అలాగే సోమనపల్లిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అప్పపల్లిలో ఓటరు జాబితా సవరణపై అవగాహన

### స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2025పై సమావేశం

### ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: సర్పంచ్

**ఆసిఫాబాద్, మే 5 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలం అప్పపల్లి గ్రామపంచాయతీలో సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2025 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఎల్ ఓ సూపర్‌వైజర్ పెరుగు సాయి, సర్పంచ్ బసవయ్య, ఉప సర్పంచ్ కావేటి రజిత, వార్డు సభ్యుడు సీహెచ్. వెంకట్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఎల్ఓ సూపర్‌వైజర్ సాయి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు లేనివారు, చిరునామా మారినవారు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై సంబంధిత దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.సర్పంచ్ బసవయ్య మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రజాప్రతినిధులు మరియు బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమని, ప్రతి ఒక్కరూ



బాధ్యతగా తమ పేరును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఉపశమనం కల్పించేందుకు టెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పేర్కొన్నారు.

## జనక్కపూర్ 1వ వార్డులో వెలిగిన వీధి దీపం

**దగ్గరుండి పనులు పూర్తి చేయించిన కౌన్సిలర్ వినోద్**
**హర్షం వ్యక్తం చేసిన స్థానికులు**



**ఆసిఫాబాద్, మే 5 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ పట్టణం లోని జనక్కపూర్ 1వ వార్డు లో చాలాకాలంగా ఉన్న స్ట్రీట్‌లైట్ సమస్యకు పరిష్కారం లభించింది. వార్డులో వీధి దీపాలు లేక చీకటితో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు కౌన్సిలర్ జాడి వినోద్ దృష్టికి తీసుకెళ్లారు.దీంతో స్పందించిన కౌన్సిలర్ వినోద్ మంగళవారం స్వయంగా దగ్గరుండి విద్యుత్ సిబ్బందితో కొత్త స్ట్రీట్‌లైట్ ఏర్పాటు చేయించారు. లైన్‌మెన్ స్తంభం ఎక్కి లైట్ అమరుస్తుండగా కౌన్సిలర్ వినోద్, స్థానికులు పర్యవేక్షించారు. సాయంత్రం వేళల్లో చీకటి కారణంగా వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడేవారని, కౌన్సిలర్ చొరవతో సమస్య తీరిందని వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని కౌన్సిలర్ వినోద్ తెలిపారు.

## అగ్నిప్రమాద బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది:

**-జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
**-కనుగుట్ట గ్రామానికి కలెక్టర్**
**-కాలిపోయిన క్రాఫ్ పరిశీలన**





**బోథ్, మే 5 (ప్రజా జ్యోతి)** అగ్ని ప్రమాదం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో పర్యటించి, అగ్నిప్రమాదంలో దగ్ధమైన జొన్న, మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా అగ్నిప్రమాదం జరిగిన తీరును, పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన తెలుసుకుని సానుభూతి వ్యక్తం చేశారు. పంట నష్టంపై తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి, బాధిత రైతుల వివరాలతో నివేదిక సమర్పించాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నివేదిక ఆధారంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.విపత్తు సమయంలో రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ ఆర్. ఎస్ చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావ్, తహసీల్దార్ సుభాష్ చందర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులకు వెళ్లిన వృద్ధురాలికి గాయాలు.



**జన్నారం,మే5(ప్రజా జ్యోతి)** జాతీయ ఉపాధి హామీలో మండలంలోని కామన్ పల్లి గ్రామానికి చెందిన మునిగల లలిత (55)అనే వృద్ధురాలు పనిచేస్తుండగా ఆకస్మికంగా కిందపడి పోయింది. దీంతో ఆమెకు గాయాలయ్యాయి.

ఉపాధి హామీ కూలీలు అది గ్రహించి 108కు సమాచారం అందించడంతో 108 సిబ్బంది ఈఎంటి రమేష్ పైలట్ శ్రీనివాస్ లు ఆమెను హుటాహుటిన లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కామన్ పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహణ సరిగా లేదని, పనులు జరుగుతున్న స్థలాల్లో కనీసం నీడ సౌకర్యం లేదని కూలీలు వాపోతున్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఇతర సౌకర్యాలు ఏమి లేకుండానే, కూలీలతో అధికారులు పనిచేస్తున్నారని వారు వాపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్, ఏపీవో పని జరుగుతున్న ప్రదేశాల్లో కనీసం ఒక్కసారైనా విజిట్ చేయకపోవ డం, వారికి సౌకర్యాలు కల్పించకపోవడమే ఇందుకు కారణం అని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పం దించి, ఇలాంటి ఘటనలు జరగకుండా, చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కూలీలు కోరుతున్నారు..

## పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం



**జైపూర్, మే 5: ప్రజా జ్యోతి** జైపూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపూ రావు ఆధ్వర్యం వహించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, ఉపాధి హామీ పనుల నిర్వహణ 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, బయోడైవర్సిటీ కమిటీల ఏర్పాటు ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా సమీక్ష చేపట్టారు. వివిధ గ్రామ పంచాయతీలలో జరుగుతున్న పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ప్రతి పథకం సమయానికి పూర్తి అయ్యేలా కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు.ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఏపీఓ బి. బాలయ్య,హౌసింగ్ ఏఈ కాంక్ష,వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## పెయింటర్స్ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**జన్నారం,మే 5 (ప్రజాజ్యోతి)** జన్నారం మండల పెయింటర్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడుగా మురిమడుగుల ప్రనిత్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఖాన్, అత్తే వెంకటేష్,ప్రధాన కార్యదర్శులుగా దుర్గం మున్నయ్య, జాడి రాజేందర్, కోశాధికారిగా ఉపారావు మధుకర్,ప్రచార కార్యదర్శి గా మంత్రి రాజు,సలహాదారులుగా జాడి లచ్చన్న, సముద్రాల దాసు, దాముఖ ప్రేమ్ సాగర్ లను ఏనుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి, పెయింటర్ల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను తోటి పెయింటర్లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతన్నకు సౌర శక్తి అండ

**మే 7న రైతు వేదికల్లో ప్రత్యేక అవగాహన సదస్సు**
**పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్న ఎస్ఈ ఉత్తమ్ జాడే**



**ఆసిఫాబాద్, మే 5 ప్రజా జ్యోతి** వ్యవసాయ రంగంలో సౌర శక్తి వినియోగం పెంచడం ద్వారా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యమని సర్కిల్ ఆసిఫాబాద్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే అన్నారు."ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా రైతు వారోత్సవాలు ఈ నెల 4 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా "వ్యవసాయ క్షేత్రాలు -- సౌర విద్యుత్ కేంద్రాలు (గ్రావీ-ఖఖూఖవీ)" అంశంపై 7వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల స్థాయి రైతు వేదికల్లో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు.సౌర విద్యుత్ ఆధారిత సాగు, విద్యుత్ భద్రత, యూనిఫామ్ సర్వీస్ లైన్ చార్జీలపై రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. పీఎం కుసుమ్ పథకాల వివరణ, లబ్ధిదారుల అనుభవాలు, సాంకేతిక మార్గదర్శకాలు అందిస్తామన్నారు.కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు హాజరవుతారని, మండల స్థాయిలో జిల్లా స్థాయిలో ఎస్ఈలు పర్యవేక్షిస్తారని తెలిపారు. టీజీ రెడ్కో ద్వారా సమాచార పుస్తకాలు పంపిణీ చేస్తామని చెప్పారు. రైతులు, ఫీూలు, సహకార సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చెన్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, 5, మే (ప్రజా జ్యోతి):**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం సాయంత్రం చెన్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల ను పరిశీలించిన ఆయన, స్టేషన్ భౌగోళిక పరిస్థితులు, సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, గ్రామాల పరిస్థితులపై సంబంధిత అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కమిషనర్, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పని చేయాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా పెట్రోలింగ్ మరియు విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దు పోలీస్ స్టేషన్ కావడంతో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సరిహద్దు గ్రామాలను తరచుగా సందర్శించాలని, మారు మూల ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారు లకు సూచించారు.

## ప్రజలకు త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 5 ,( ప్రజాజ్యోతి ).**ప్రజలకు త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్, భవేశ్ మిశ్రా త్రాగునీటి అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎవరికి ఎట్టి పరిస్థితుల్లో త్రాగునీటి కొరత రాకూడదని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు అంతా గతంలో నీటి సమస్య ఏర్పడిన ప్రాంతాలను గుర్తించి, నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రోజువారి నీటి సరఫరా లో ఆటంకాలు ఎదురైతే, సమస్యలు తీర్చేందుకు తగు ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే కడెం ప్రాజెక్టు అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం పూర్తయ్యేలోపు గేట్లకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న మరమ్మత్తులు ఉంటే పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటినుంచి గేట్ల మరమ్మత్తుల చర్యలు పూర్తిచేస్తే వర్షాకాలం ఎటువంటి ఇబ్బంది కలగదని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, ఇరిగేషన్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో ఏసీబీ దాడులు

**శ్రీమంచిర్యాల జిల్లా వెల్ఫేర్ కార్యాలయంలో తనిఖీలు**



**మంచిర్యాల, 5, మే (ప్రజా జ్యోతి):**మంచిర్యాల జిల్లా సంక్షేమ శాఖ (వెల్ఫేర్) కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మంగళవారం ఆలస్యంగా ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. కార్యాలయాల్లో కొంతకాలంగా జరుగుతున్న అవకతవకలు, క్యాష్‌బుక్‌లో తేడాలు ఉన్నాయన్న సమాచారం మేరకు అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. తనిఖీల్లో భాగంగా కార్యాలయంలోని రికార్డులను పూర్తిగా పరిశీలించారు. జిల్లాకు సంబంధించిన కీలక విభాగాల్లో పనిచేస్తున్న అధికారుల పనితీరుపై ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అనంతరం ఏసీబీ డీఎస్పీ మధు మాట్లాడుతూ, కార్యాలయ కార్యకలాపాల్లో అవకతవకలు జరుగుతు న్నాయన్న ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు



**లక్ష్మణ చాంద, మే 5 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రం లో జరుగుతున్న ఒక బాల్య వివాహాన్ని మంగళవారం రోజున అధికారులు అడ్డుకున్నారు. 15 సంవత్సరాల బాలికకు నిశ్చితార్థం చేశారని సమాచారం అందుకున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు బాలికకు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ అధికారి ఓస శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం-2006' ప్రకారం 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకి వివాహం చేయడం నేరం అని వివరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పిల్లల భవిష్యత్తు కోసం వారి విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యస్.ఐ శ్రావణి, డిప్యూటీ తహసీల్దార్ బాబు సింగ్, గ్రామ సర్పంచ్ ఓస కవిత రాజు, సూపర్వైజర్ ప్రసన్న కుమారి , చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా సమన్వయకర్తలు నల్ల గంగాధర్, కౌన్సిలర్ సుప్రియ, కేసు వర్కర్ శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

## హంసరాజ్ కృషితోనే బెంగాల్‌లో బీజేపీ విజయం

**మాజీ కేంద్రమంత్రిని సన్మానించిన విశాల్ కాంద్రె**



**ఆసిఫాబాద్ మే 5 ప్రజా జ్యోతి** మాజీ కేంద్ర మంత్రి హంసరాజ్ గంగారాం ఆహిర్‌ను టీపిసి రాష్ట్ర సభ్యుడు విశాల్ కాంద్రె ఆహిర్ బుధవారం శాలువాతో సన్మానించారు. చంద్రపూర్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించిన అనంతరం విశాల్ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచిందని, బెంగాల్ విజయంలో హంసరాజ్ పాత్ర కీలకమని అన్నారు. బెంగాల్‌లో బహిరంగ సభను అడ్డుకున్నప్పుడు మమతా బెనర్జీని ఉద్దేశించి 'బీజేపీ అంటే భయమెందుకు? తప్పు చేస్తేనే భయపడాలి' అని హంసరాజ్ సవాల్ చేశారని తెలిపారు. ఎన్సీబీసీ చైర్మన్‌గా బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులకు మమతా సర్కార్ ఆధార్, ఓటర్ కార్డులు ఇస్తున్న స్కాంను బయటపెట్టారని, దీంతో బీజేపీకి మద్దతు పెరిగిందని వివరించారు. కార్యక్రమంలో రఘువీర్ ఆహిర్, రాజిగిర్ చౌదరి, గణేష్, ముర్కుర్ రాజు, దిలీప్, నజీర్ పాల్గొన్నారు.

## గాయపడ్డ నాయకుడికి ఆడే గజేందర్ పరామర్శ



**నేరడిగొండ, మే 05 (ప్రజాజ్యోతి):**నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్వప్న ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి రామకృష్ణను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రామకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఆడే గజేందర్ వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఆత్మహత్య కి కారణమైన వ్యక్తి అరెస్ట్



**సారంగాపూర్, మే 05,ప్రజా జ్యోతి** ఆలూరు గ్రామానికి చెందిన గజ్జ శ్రీధర్,వయస్సు:37 సం,, పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మరణించాడు ఆలూరు గ్రామానికి చెందిన దేశెట్టి గంగయ్య వ,, 50సం,, మృతుడి యొక్క పొలం కోయడానికి హార్వెస్టర్‌లు రాకుండా అడ్డుకుంటూ మానసి కంగా ఇబ్బంది పెడుతున్నాడని, మృతుడు గజ్జ శ్రీధర్ మనస్థాపం చెంది ఏప్రిల్ నెల 29 నాడు నిర్మల్ లోని కలెక్టరేట్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య కి పాల్పడగా, చికిత్స పొందుతూ మరణించినాడు. ఇ విషయం పైన మృతుడి భార్య గజ్జ ప్రేమల ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసుకొని శ్రీధర్ మృతికి కారణమైన దేశెట్టి గంగయ్య ని అరెస్ట్ చేశామని పోలీస్ లు తెలిపారు.

## అసెంబ్లీలో ఎమ్మెల్యే గళం రైతులకు న్యాయం

-రాజురా రైతులకు రూ. 1.18 కోట్ల నష్టపరిహారం



**నేరడిగొండ, మే 05 (ప్రజాజ్యోతి ):**నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామ రైతులకు దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ నష్టపరిహారం ఎట్టకేలకు విడుదలైంది. 2012లో గ్రామంలో నిర్మించిన చెరువు కారణంగా భూములు కోల్పోయిన రైతులకు, రెండో విడత కింద రూ. 1 కోటి 18 లక్షల చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు.గత 2014లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మొదటి విడతగా 50 శాతం నిధులు విడుదలయ్యాయి. అయితే మిగిలిన నిధుల కోసం రైతులు ఎదురు చూస్తున్న తరుణంలో, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఈ సమస్యను శాసనసభలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చొరవతో ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయడంతో రైతుల కల సాకారమైంది. తమ గోడును అసెంబ్లీలో వినిపించి, న్యాయం చేసినందుకు రాజురా గ్రామ రైతులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు ఎమ్మార్వో కలీం, ఆర్ ఐ నాగోరావు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఉట్నూర్ ఐటిడిఏ నూతన పీఓ కు సత్కారం

బీఆర్ఎస్‌వి మాజీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్



**ఉట్నూర్ మే 5 (ప్రజాజ్యోతి)**ఖానాపూర్ నియోజకవర్గ బి ఆర్ఎస్ ఇన్చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు మంగళవారం ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మంద మకరంద ను తన ఛాంబర్ లో బీఆర్ఎస్‌వి మాజీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పీఓ మంద మకరంద మాట్లాడుతూ ఐటిడిఏ ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపినట్లు ధరణి రాజేష్ తెలిపారు.

## పోతపల్లిలో హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సర్పంచ్ దుర్గం పోషన్న



**మే 5, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని పెంచికల్ పేట్ మండలం పోతపల్లి గ్రామంలో హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు ను సర్పంచ్ దుర్గం పోషన్న రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెల్త్ క్యాంపు ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ క్యాంపు లో 37 మంది మహిళలకు 52 మంది పురుషులకు మొత్తం 89మందికి చెస్ట్ ఎక్సరే పరీక్షలు నిర్వ హించినట్లు రేడియోగ్రఫీ టెక్నీషియన్ వరుణ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయిర చిన్నయ్య. వార్డ్ సభ్యులు బండి వెంకటాచలం,టీబీ హెచ్.వి, శ్రీలత, ఎస్.టి. ఎస్,ఖాదర్ పాషా,ఎం. ఎల్. హెచ్.పి,సుచరిత కార్యదర్శి రాకేష్, ఏఎన్ఎం చంద్రకళ,ఆశ కార్యకర్తలు జయ, సువర్ణ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చల్లా విశ్వంబర్ రెడ్డి నియామకం



**జైపూర్, మే 5: ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తాజా నిర్ణయాల్లో భాగంగా జైపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా చల్లా విశ్వంబర్ రెడ్డిని నియమించారు.ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి సలహా మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. వెంటనే అమల్లోకి వచ్చేలా ఈ నిర్ణయం తీసుకున్నారు.చల్లా విశ్వంబర్ రెడ్డి నియామకం పై జైపూర్ మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సమయానికి రండి.. లేదంటే చర్యలు!

సిబ్బందికి కలెక్టర్ హరిత స్ట్రాంగ్ వార్నింగ్

కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు



**ఆసిఫాబాద్, మే 5 ప్రజా జ్యోతి** ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ హరిత హెచ్చరించారు. పాటించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని జిల్లా భూ కొలతల అధికారి కార్యాలయం, జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. విధులకు హాజరైన సిబ్బంది వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, సిబ్బంది సమయానికి కార్యాలయాలకు రావాలన్నారు. సమయపాలన పాటించడం ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు.తనిఖీల్లో సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వేధింపులకు చెక్ షీ టీమ్స్‌తో మహిళలకు భరోసా



**జైపూర్, మే 5: ప్రజా జ్యోతి** మహిళలు ఎటువంటి వేధింపులనైనా సహించకుండా ధైర్యంగా ముందుకు రావాలని అవసరమైతే వెంటనే షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని పోలీసులు పిలుపునిచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో జిల్లాలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.ఈ క్రమంలో జైపూర్ మండలం కుందారం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు భద్రతా చర్యలు ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు మానవ అక్రమ రవాణా, ట్రాఫిక్ నియమాలపై విస్తృతంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా డయల్ 100కు కాల్ చేయాలని అలాగే షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385లను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు.తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు వచ్చి తన హక్కులను కాపాడుకోవాలని పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ రజనీతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఎస్సై ని కలిసిన కాంగ్రెస్ నాయకుడు నిట్టూరు జనార్ధన్



**జైపూర్, మే 5: ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై భూమేష్‌ను పెగడపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నిట్టూరు జనార్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న పలు ప్రజా సమస్యలు, గ్రామాల్లో శాంతి భద్రతల పరిస్థితిపై ఆయన ఎస్సైతో చర్చించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పోలీస్ శాఖ సహకారం అవసరమని జనార్ధన్ వివరించారు. ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ చర్యలు తీసుకుంటామని ఎస్సై భూమేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## కలెక్టర్ ను సన్మానించిన 57 ఉపకులల రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం గంగాధర్



**ఖానాపూర్ మే 5( ప్రజా జ్యోతి )**నిర్మల్ జిల్లా కలెక్టర్గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భవేశ్ మిశ్రా ను 57 ఉపకులల రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి సన్మానం చేశారు 57 ఉప కులాల సమస్యలను వివరించి, కార్పొరేషన్ లోన్ లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇప్పటికి కూడు గూడు,గుడ్డ లేకుండా అనేక కుటుంబాలు జీవిస్తున్నారని, వారిని ప్రత్యేకంగా గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దాసరి శివ, ధూంధాం కళాకారులు దరువు భోజన్న తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ చొరవతో ఇంటింటికి భగీరథ నీరు



**నేరడిగొండ మే 05( ప్రజా జ్యోతి):**మండలంలోని బోరిగాం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వేసవి తీవ్రతతో తాగునీటి కోసం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అధికమవుతున్న నేపథ్యంలో, గ్రామ సర్పంచ్ రాథోడ్ వినీష్ వెంటనే స్పందించారు.సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గ్రామంలోని నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పనులను వేగవంతం చేశారు. పైపులైన్ మరమ్మతులు, లీకేజీల నివారణ వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించడంతో గ్రామానికి మళ్లీ నీటి సరఫరా పునరుద్ధరించబడింది. దీంతో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్షణ చర్యలు తీసుకుని నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు

## ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్




**ఉట్నూర్, మే 5 (ప్రజాజ్యోతి)** ఉట్నూర్ మండలంలోని శాంతి నగర్, బిర్సాయి పేట్ గ్రామాల లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు.వెయిట్ మెషిన్ పై వరి ధాన్యాన్ని నాణ్యత చూశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా , మహిళా సంఘాల ద్వారా అనేక ప్రభుత్వ సంక్షేమ పతకాలను అందిస్తున్నాం అని ,ఐకేపీ ఆధ్వర్యంలో వివో సంఘాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరకే కొనుగోలు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిసిసి ఉపాధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య, జైనూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాధాబాయి, లక్కారం మాజీ సర్పంచ్ మరసుకోల తిరుపతి, ఐకెపి ఎపిడి గోవిందరావు, డిపిఎం మల్లేష్, ఐకెపి సిసిలు నరసయ్య, సంతోష్, కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి మహేందర్, వివో సంఘాల మహిళా నాయకులు ఐకేపీ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

## సోనాల మండల టాపర్ కు ఘన సన్మానం



**సోనాల. మండలం మే 5: (ప్రజాజ్యోతి)** పదవ తరగతి సోనాల మండల టాపర్ బిజ్జూరి అన్విక. సోనాల మండల కేంద్రానికి చెందిన బిజ్జూరి సుమన్ రెడ్డి పుత్రిక 582 మార్కులతో సోనాల మండలంలో అత్యధిక మార్కులతో తోటి విద్యార్థులకు మార్గదర్శకు రాలైంది. ఈమె రైతు కుటుంబంలో పుట్టిన, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గాజుల పోతన్న మరియు ప్రధాన కార్యదర్శి కసిరె పోతన్న వీరితో పాటు చెట్లపల్లి అనిల్, సదానందం, శ్రీనివాస్, మారిశెట్టి దయా సాగర్, చంద్రకాంత్ సన్మానించడం జరిగింది. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొంది తల్లిదండ్రులతో పాటు సమాజము గర్వించే ఉత్తమ సేవలు అందించి ఉత్తమ సమాజ సేవకురాలిగా మునుముందు సాగాలని పూలే వెల్ఫేర్ సభ్యులు బిజ్జూరి అన్వికను అభినందించారు.

## బాల్యవివాహాలను అరికడదాం చదువులో ముందుకు సాగుదాం

– –ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల



**నేరడిగొండ మే 05 (ప్రజాజ్యోతి):**వడూర్ గ్రామ పంచాయతీ పరిధిలో స్నేహ స్వయం సహాయక సంఘం ( ఎస్ హెచ్ జి ) ఆధ్వర్యంలో కిశోర బాలికల సమావేశాన్ని మంగళవారం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. బాలికల ఆరోగ్యం, విద్య మరియు సామాజిక అవగాహనే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది.ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ ఉపసర్పంచ్ ఎడ్ల మమత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు ఐసీడీఎస్ సూపర్వైజర్ మంజుల (డీహెచ్ఈడబ్ల్యూ) ప్రతినిధి గడ్డం నికిలేశ్వర్ రెడ్డి పాల్గొని బాలికలకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో భాగంగా బాలికల పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత మరియు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ మంజుల మాట్లాడుతూ.. బాలికలు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వీఓ ప్రెసిడెంట్ వనిత, వీఓఏ లు రాజు, రాజిత ఎస్.హెచ్.జి ఈసీ సభ్యులు మరియు సీసీ బండారి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై డీవైఎఫ్ఐ ఆగ్రహం

ఖజానాకు గండి కొడుతున్న ఇసుక మాఫియా

అధికారులు చర్యలు తీసుకోవాలి: చాపిడి పురుషోత్తం





**ఆసిఫాబాద్ మే 5:ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం రాంపూర్ గ్రామ సమీపంలోని మార్కెట్ యార్డ్ వద్ద అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ, పోలీస్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి చలాన్ కట్టకుండా ఇసుక దందా చేస్తూ ఖజానాకు గండి కొడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఇసుక మాఫియాను అరికట్టాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం ప్రారంభం



**ఖానాపూర్ మే 5( ప్రజా జ్యోతి)** ఖానాపూర్ పట్టణం విద్యానగర్ కాలనీలో శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కి సంబంధించిన కార్యాలయాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక ప్రారంభించారు ఖానాపూర్ పట్టణంలో ప్రజలకు అందుబాటులో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని పొదుపుపై దృష్టి సారించాలని మౌనిక అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్ కౌన్సిలర్స్ రాజుర సత్యం నిమ్మల శ్రీనివాస్ తాళ్లపెల్లి రాజా గంగన్న గుమ్ముల ఆనంద్ కుమార్ బొప్పారపు సత్యవతి తొడసం ఇందిరా నాయకులు అంకశీ మహేందర్ ప్రకాష్ గౌడ్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ వినోద్ తో పాటు కంపెనీ పై అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు చేపడుతున్నాం

జీసిసి డిఎం గుడిమల్ల సందీప్ కుమార్



**ఉట్నూర్ మే 5 (ప్రజాజ్యోతి )** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పరిధిలోని వివిధ గిరిజన ప్రాథమిక మార్కెటింగ్ సహకార సొసైటీ (జీపీసీఎంఎస్) ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు చేపడుతున్నట్లు ఉట్నూర్ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఆదిలాబాద్ సొసైటీ ఆధ్వర్యం లో సేకరించి, నిల్వా చేసిన తేనె ను పరిశీలించారు. ఇప్పటివరకు జీసీసీ ద్వారా 25 క్వింటాళ్ళ తేనె ను, 122 క్వింటాళు ఇప్పపువ్వ సేకరించినట్లు తెలిపారు.ఆదివాసీలు, గిరిజనులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మధ్య దళారులకు అమ్మి మోసపోకుండా జీసీసీ డీఆర్ డిపోల వద్ద, సొసైటీ కార్యాలయాల వద్ద విక్రయించి రశీదు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మేనేజర్ ఇస్తారి, ఉట్నూర్ అకౌంటెంట్ గోవిందరావు, ఉద్యోగులు రమేష్, సవాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం నాయకుడు ఇందూరి తిరుపతికి ఘన స్వాగతం



**మంచిర్యాల, 5,మే (ప్రజా జ్యోతి):** మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, మంచిర్యాల జిల్లా ఇంచార్జిగా తొలిసారి విచ్చేసిన ఇందూరి తిరుపతికి జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు శాలువా కప్పి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మిట్ట లచ్చన్న, గౌరవ అధ్యక్షుడు బొలిశెట్టి రాజలింగు, గొంగళ్ల శంకర్, ఉపాధ్యక్షులు అంబిలపు శ్రీనివాస్, అగ్గి సత్యం, సీపతి శ్రీనివాస్, పూరేళ్ల పోషమల్లు పాల్గొన్నారు.అలాగే నియోజకవర్గ ఇంచార్జి పల్లె భూమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ తూముల నరేశ్, పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి కిషన్, కార్యదర్శి బోయిని శ్రీనివాస్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్యామ్, యూత్ నాయకులు ఆరె శ్రీనివాస్, దండేపల్లి మండల గౌరవ అధ్యక్షుడు ఇప్ప రమేష్, వసర్థి అశోక్, చిట్ల విజయ్, నామసాని సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతానికి కృషి చేయాలని, సభ్యులు ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

## తండ్రికి భారం కావద్దనే ఆవేదనతో యువతి ఆత్మహత్య

**జైపూర్ మే 5 ప్రజా జ్యోతి**జైపూర్ మండలంలోని రసూల్ పల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది,తండ్రికి భారం కావద్దని మనస్థాపానికి గురైన గంగోత్రి (18) అనే యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.ఈ ఘటన కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతురాలి తండ్రి బొద్దుల శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్ఐ హబీబ్ తెలిపారు.కేసును పరిశీలిస్తూ, ఆత్మహత్యకు గల అసలు కారణాలపై విచారణ కొనసాగిస్తున్నామని అన్నారు. యువతి మరణానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి

--హెచ్ ఇ ఓ పవర్ రవీందర్



**నేరడిగొండ, మే 05 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రోజున ఆశా కార్యకర్తల నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సద్దాం, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ( హెచ్ ఇ ఓ ) పవార్ రవీందర్, హెల్త్ సూపర్వైజర్లు సంతోష్,స్వర్ణలత హాజరై ఆశాలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. గ్రామాల్లో అసంక్రామ్య వ్యాధుల ( ఎన్ సి డి ) స్క్రీనింగ్ వేగవంతం చేయాలని, సికల్ సెల్ ఎనీమియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అనుమానిత లక్షణాలు ఉన్నవారి నుంచి వెంటనే టీబీ శాంపిల్స్ సేకరించాలి.గర్భిణీల ( ఏ ఎన్ సి ) రిజిస్ట్రేషన్ సకాలంలో పూర్తి చేయాలి. ముఖ్యంగా హై-రిస్క్ గర్భిణీలను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలి. హెచ్. పి.వి వ్యాక్సినేషన్ ప్రాధాన్యతను వివరించాలి. ఈ కార్యక్రమంలో ఎం. ఎల్.హెచ్.పిలు వైష్ణవి, మౌనిక, వాణి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు మరియు మండలంలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో విషాదం: వడదెబ్బతో బాలిక మృతి



**సోనాల. మే 5: (ప్రజా జ్యోతి)** సోనాల మండలంలోని వజ్జర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లెండి గుడాలో మడవి శ్రీదేవి వడ దెబ్బతో మంగళవారం ఉదయం మృతి చెందింది. మారుమూల గిరిజన గ్రామంలో వడ దెబ్బ తగిలి ఓ పద్నాలు గెల్ల బాలిక మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

## పలు గ్రామాలు సందర్శించిన ఎంపిడివోరాథోడ్ రాధ



**ఖానాపూర్ మే 5 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్,బాదనకుర్తి గ్రామాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాథోడ్ రాధా మంగళవారం సందర్శించారు ఇందులో భాగంగా పంచాయతీలోని పరిస్థితుల్ని సమీక్షిస్తూ ఆ గ్రామాల్లో గల నర్సరీలను పరిశీలించి వేసవికాలంలో నర్సరీ మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని అక్కడ సర్పంచ్ పాలకవర్గాలను ఆదేశించారు వేసవి కాలంలో గ్రామాల్లో తాగు నీటి సమస్య తీర్చేందుకు వార్డు సభ్యులు ఉప సర్పంచ్ సర్పంచ్ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రత్నాకర్ రావు కార్యదర్శి సురేందర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## పార్టీ కి పని చేయని వారికి పదవులా..?

**బోథ్, మే 5 (ప్రజా జ్యోతి)**బోథ్ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వ్యవహారం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడి, ప్రతి ఎన్నికలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల వరకు పార్టీ జెండా ఎగరేయడానికి పోరాడిన నిజమైన సైనికులను పక్కన బెట్టి, గతంలో పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారిని పదవులతో సత్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు గుప్పుమంటున్నాయి. దీంతో నిజమైన కార్యకర్తల గుండెలు మండుతు ఆగ్రహానికి దారితీస్తున్నాయేమో! పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులకు పనిచేసిన వారే నేడు పదవుల రేసులో ముందుంటే, ఇది కేవలం అన్యాయం కాదు పార్టీ పునాదులపై దాడి. నిబద్ధత, కష్టం, త్యాగం అనే విలువలను తుంగలో తొక్కి అవమానించే నిర్ణయాలు తీసుకుంటే, అది కార్యకర్తల మనోభావాలను ఛిద్రము చేసే ప్రమాదకర చర్యగా మారే అవకాశం ఉందని పార్టీకి క్షేత్రస్థాయిలో నష్టం వాటిల్లే అవకాశం ఉందని కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. పార్టీ కోసం పోరాడినవారికి శిక్షా..? పార్టీకి ద్రోహం చేసినవారికి బహుమానాలా..? అనే ప్రశ్న బోథ్‌లో ప్రతి కార్యకర్త నోట వినిపిస్తోంది.ఈ విధంగా పార్టీ ద్రోహులను ప్రోత్సహించడం కొనసాగితే, నిజాయితీగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురై పార్టీకి దూరమయ్యే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది పార్టీ భవిష్యత్తుకు తీవ్రమైన ప్రమాదం. ఇప్పటికైనా పార్టీ ఉన్నత నాయకత్వం మేల్కొని, ఈ అన్యాయానికి చెక్ పెట్టాలి. పార్టీకి అంకితభావంతో పనిచేసినవారికే పదవులు ఇవ్వాలి. లేకపోతే కార్యకర్తల ఆవేదన ఆగ్రహంగా మారి పెద్ద ఉద్యమంగా మారే అవకాశాన్ని విస్మరించకూడదు. పార్టీని నిలబెట్టినవారే గౌరవానికి అర్హులు ద్రోహులకు కాదు! ఇతర జిల్లా ఓ ముఖ్య నాయకుడు మన ప్రాంతం పై పెత్తనం చెలాయిస్తున్నట్లుగా కార్యకర్తలు పదేపదే చర్చించుకుంటున్నట్లుగా వినికిడి. ఇటువంటి పనులతో పార్టీకి నష్టం తో పాటుగా నికార్సైన కార్యకర్తలు దూరమయి అవకాశం మెండుగా ఉండనున్నట్లు కార్యకర్తలు తమలోతాముగా చర్చించుకుంటున్నారు. ఇకనైనా అధిష్టానం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం తీసుకొని కష్టపడ్డ కార్యకర్తలకు పదవులను అప్పజెప్పితే అందరికీ ఆమోద్యయోగంగా ఉండే అవకాశం ఉంటుందని ప్రతి కార్యకర్త చర్చించుకుంటున్నారు. ఎప్పుడు ప్రజలలో ఉండే ప్రజల మేలుకోరే ప్రజల కోసం సేవ చేసే వారికి కట్టబెడితే రేపటి రోజు పార్టీ ప్రతిష్ట పెరగడంతో పాటు ప్రజలు హర్షించే అవకాశం ఉంటుందని, కార్యకర్తలు కోరుతున్నారు.

# మే 6వ తేదీ రోజున 10 గంటలకు దహెగాం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక సమావేశం

**ముఖ్యతిథిగా పాల్గొన నున్న తెలంగాణ ఉద్యమ కారుల రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనా రాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్**

**సిర్పూర్(టి) నియోజకవర్గంలోని అన్ని మండల ల ఉద్యమ కారులు ఆహ్వానితులే:**

**దహేగం మండల ఉద్యమకారులు పుల్లం నారాయణ:**



**మే 5 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని దహేగాం మండల కేంద్రంలోని రైతు వేదికలో రేపు,మే 6వ తేదీ రోజున ఉదయం 10 గంటలకు తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక సమావేశం నిర్వహించడం జరుగుతుందనిదహేగాం ఉద్యమకారులు పుల్లం నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కొరకు ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర చైర్మన్ నరాల సత్య నారాయణ వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని అన్నారు.సందర్భంగా సిర్పూర్(టి) నియోజక వర్గంలోని అన్ని మండల ల తెలంగాణ ఉద్యమ కారులు ఆహ్వానితులే అని అన్నారు. సిర్పూర్ (టి) నియోజకవర్గం లోని అన్ని మండలాల నుండి తెలంగాణ ఉద్యమ కారులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారుల రాష్ట్ర వైస్ చైర్మన్ కోడెటి శంకర్ గౌడ్ తెలిపారు. అనంతరం ఉద్యమకారుల రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారా యణ, వైస్ ఛైర్మెన్ తోడేటి శంకర్ గౌడ్ చరవాణి ద్వారా మాట్లాడుతూ. 2001నుండి 2014వరకు ఉద్యమంలో పాల్గొన్న సిర్పూర్ (టి) నియోజక వర్గంలోని అన్ని మండల ల నుండి తెలంగాణ ఉద్యమ కారులు సకాలం లో హాజరై తమ సమస్య లను నిర్భయంగా తెలపాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరందహేగాం మండలం ఉద్యమకారులు పుల్లం నారాయణ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కావేటి సమ్మయ్య సిర్పూర్ (టి) నియోజకవర్గంలో తెలంగాణ సాధనకై చివరి శ్వాస ఉన్నంత వరకు పోరాడి అసెంబ్లీ పై జెండా ఎగుర వేశారని అన్నారు. అసలైన ఉద్యమకారులని వారిని అభినందించి ప్రశంసించారు. స్వర్గీయ కావేటీ సమ్మయ్యనేనాని అసలైన ఉద్యమకారని పేర్కొన్నారు. జై తెలంగాణ నినాదాలు చెసి ఉద్యమాలు చేసిన నాయకులను గుర్తించకుండా, నైతెలంగాణ వాదులు,స్వార్ధ నాయకులు, మేమే అసలైన తెలంగాణ ఉద్యమ కారులమని ముందుకు వచ్చికాలయాపన చేస్తూ అసలైన ఉద్యమ కారులను పట్టించుకోవడం లేదు, ఏనాడూ ఉద్యమములో పాల్గొనని వారు పదవులు అనుభవిస్తూ కోట్లు సంపాదించుకొని మమ్ములను అవహేళన చేస్తున్నరని అన్నారు. బతుకుదెరువు కోసం వచ్చిన నాయకులు ఉద్యమ కారుల జోలికి వస్తే ఖబర్దర్ అని హెచ్చ రించారు. పదవులు, పొతే ఎంత ఆరాట పాడుతు న్నారో ప్రజలు గమనిస్తు న్నారని అన్నారు. పదవులు,ఆస్తి శాశ్వతం కావు. సిర్పూర్(టి) నియో జకవర్గంలోని అన్ని మండలలను అభివృద్ధి చేయాలని దహేగాం మండల ఉద్యమకారులు పుల్లం నారాయణ హెచ్చరించారు.

## కేటీఆర్ క్షమాపణ చెప్పాలి టీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్ :** తెలంగాణ రక్షణ సేన నాయకులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కేటీఆర్రు వరంగల్ వచ్చే ముందు పొలిమేర దగ్గర ఆగి ప్రజలకు క్షమాపణ చెప్పాలి. పదేళ్లు అధికారం ఇస్తే వరంగల్ రైతాంగానికి ఏమీ చేశారో ముందు సమాధానం చెప్పాలి. మీ పదేళ్ల పాలనలో దేవాదుల కూడా పూర్తి చేయలేదు. వరంగల్ కు డెడికెటేడ్ గా ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను కూడా తేలేదని అన్నారు. ఇరిగేషన్ కోసం లక్షా 89 వేల కోట్లు ఖర్చు చేసిన మీరు వరంగల్ కు ఏమీ ఇచ్చారు. నర్సంపేట్, మనుకోట వద్ద మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ పెడతామన్నారు. అది ఎక్కడ పెట్టారో చూపించాలి. సూటు, బూటు వేసుకొనే మాజీ ఐటీ మినిస్టర్ కేటీఆర్ కు అగ్రికల్చర్ గురించి ఏమీ తెలుసు. వరంగల్ కు మీరు రావటం అంటే... కేసీఆర్ రాడని సంకేతాలు ఇస్తున్నారా? కాకతీయ కాలంలోనే రామప్ప, పాకాల లాంటి చెరువులతో ఈ ప్రాంతం ఇరిగేషన్ లో అభివృద్ధి చెందింది. కానీ బీఆర్ఎస్ పదేళ్లలో కొన్ని చెరువుల పూడికలు తప్ప ఏం చేయలేదు? వరంగల్, కాజీపేట, హన్మకొండ నగరాల్లో మూడు రోజులకొకసారి కూడా నీళ్లు రాని పరిస్థితి తెచ్చారని అన్నారు. వరంగల్ ను స్మార్ట్ సిటీ చేస్తామని ఆ దిశగా ఎలాంటి పనులు చేపట్టలేదు. హన్మకొండ బస్టాండ్ ను పూర్తిగా బొందలగడ్డగా మార్చేశారు. మీ పిట్టల దొర మాటలతో మా వరంగల్ బిడ్డలను మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నారా అని ప్రశ్నించారు. పర్లపల్లి శ్రీశైలం మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు కాకతీయ యూనివర్సిటీలో ఉద్యమకారులను పట్టించుకోని వ్యక్తి కేటీఆర్. ఇప్పుడు రైతు సభ అంటూ మళ్లీ వరంగల్ కు వస్తున్నావా? కాకతీయ యూని వర్సిటీకి కనీసం రూపాయి కూడా ఇవ్వని మీరు వరంగల్ ఎందుకు వస్తున్నారు? అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులు

## ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పుని గౌరవించాలి

**బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైద్రాబాద్ :** యావత్ ప్రపంచం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశాన్ని ప్రగతి పథంపై పరుగులు పెట్టిస్తోన్న నేపథ్యంలో తెలంగాణ ప్రజలు మోదీకి ఘనస్వాగతం పలకాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కోరరు. బెంగాల్ లో 100 సీట్లలో ఓట్ చోరీ జరిగిందని మమత అంటున్నారు. దీనికి రాహుల్ గాంధీ కూడా మద్దతు తెలిపాడు. ఓటు చోరి చేసేటోళ్లే చోరీ గురించి మాట్లాడుతున్నారు. వీళ్ళందరికీ చోరీ అలవాటే. అప్పుడు గెలిచారు, ఇప్పుడు వారి చోరీ నడవట్లేదు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల తీర్పుని అంగీకరించాలి, ప్రజలను అవమానపరిచే మాటలు మాట్లాడడం మంచిది కాదు.ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు సర్వశక్తివంతమైనది, సర్వోత్తమైనది. దానిని అవమాన పరుస్తుంటే కాంగ్రెస్ మద్దతు తెలపడమా?మూడు సార్లు మమతా గెలిచినప్పుడు మేం ఏమైనా అన్నామా? ప్రజా తీర్పును గౌరవించాం. కానీ వాళ్లు ఓడిపోతే ఈవీఎంలు, ఈసీఐ, దేశాన్ని నిందిస్తారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పుని గౌరవించాల్సిన అవసరం ఉన్నదన్నారు.

## క్రీడా సంఘాలకు సహకరిస్తాం మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

**హైద్రాబాద్ :** రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కొరకు క్రీడా సంఘాలు నిర్వహించే అన్ని కార్యక్ర మాల విజయవంతనికి సంపూర్ణంగా సహకరిస్తామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేనారెడ్డిలు తెలిపారు. ఎల్ బి స్టేడియంలో 09 ఁ 10 మే 2026 నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌అధికారిక బ్రోచర్‌ను క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మరియు తెలంగాణ క్రీడా